ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 25 ఏప్రిల్ 2025

28, 29న సర్టిఫికెట్ల పరిశీలన


మంథని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం(ఆర్‌వైవీ) స్కీం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 28, 29వ తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని కమిషనర్ ఎన్ మనోహర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 28న ఎస్‌బీఐ, ఎస్‌బీఐ ఏడీబీ బ్రాంచ్‌లు, యూనియన్ బ్యాంక్, 29న యూనియన్ బ్యాంక్, టీజీబీ, కెనరా, కేడీసీసీ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్ అధికారులు దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, పాన్ బ్యాంక్ పాసు బుక్కు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను పరిశీలిస్తారని, వీటి దరఖాస్తుదారులు వెంట తీసుకొనిరావాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పట్టణంలోని వివిధ వ్యాపార, దుకాణదారులకు ఫోన్ చేసి ట్రేడ్ లైసెన్స్ పేరిట డబ్బులను ఆన్‌లైన్‌లో పంపాలని లేకపోతే దుకాణాలను సీజ్ చేస్తామని మున్సిపల్ పేరిట బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వ్యాపారులు నేరుగా మున్సిపల్ ఆఫీసుకు వచ్చి పన్నులు చెల్లించాలని సూచించారు. ఎవరైనా మున్సిపల్ పేరిట కాల్స్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ నేడు సుల్తానాబాద్ బంద్

సుల్తానాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో భారతీయ హిందూ పర్యాటకులపై పాక్ ఉగ్రవాదుల దాడికి నిరసనగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం బంద్ పాటిస్తున్నట్లు హిందూ ఐక్య వేదిక నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల వ్యాపార వాణిజ్య సంస్థల వారు తమ దుకాణాలు మూసివేసి ఉగ్రదాడిలో మరణించిన వారికి సంఘీభావం తెలిపి బంద్‌కు సహకరించాలని వారు కోరారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'ఉపాధి'లో కోత

- జిల్లాకు 13.99 లక్షల పనిదినాలే కేటాయించిన కేంద్రం
- ప్రతీఏటా 22 నుంచి 26 లక్షల పనిదినాల లక్ష్యం
- ఆందోళన చెందుతున్న ఉపాధిహామీ కూలీలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)
మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి పొందుతున్న కూలీలకు ఇక సరిపడా పనులు దొరకవు. ప్రతి ఏటా ఆయా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించే పనిదినాలను సగానికి కుదించడం కూలీలకు శరాఘాతంగా మారింది. రాష్ట్రానికి 12 కోట్ల పనిదినాలకు బదులు 6.5 కోట్ల పని దినాలను కేటాయించింది. జిల్లాకు 13.99 లక్షల పని దినాలను కేటాయించారు. దీంతో ఉపాధిహామీ కూలీలకు చేతి నిండా పనిదొరికే పరి స్థితి లేదు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కూలీలు, ఇతరులు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ఉండేందుకు గాను 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించింది. ఈ పథకం ద్వారా ప్రతి ఏటా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలకు 100 పనిదినాలు కల్పించాలని లక్ష్యం విధించారు. ఈ పథకం కింద కేంద్రప్రభుత్వమే నిధులను కేటాయిస్తుంది. కేటాయించిన నిధుల్లో 60 శా తం నిధులను కూలీల కోసం, 40 శాతం నిధులను మెటీరియల్ కాంపొనెంట్ పనులకు వెచ్చించాలని చట్టంలో పేర్కొన్నారు. ఏడాదికి సరిపడా ఉపాధి పనులను గుర్తించేందుకు ప్రతి ఏటా నవంబరు, డిసెంబరు నెలలో పనులను గుర్తిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు కేటాయించే పని దినాలు, బడ్జెట్‌ను, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు కేటాయిస్తుంది.

ఐదేళ్లలో చేపట్టిన పనిదినాలు

సంవత్సరం	పనిదినాలు (లక్షల్లో)
2020-21	27.43
2021-22	25.60
2022-23	23.27
2023-24	20.61
2024-25	25.55

● 1.19లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు..

జిల్లాలో 1.19 లక్షల కుటుంబాలకు జాబ్ కారులను జారీ చేయగా, వీటిలో 2.44 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. ప్రతి ఏటా పెద్దపల్లి జిల్లాకు 20 నుంచి 27 లక్షల వరకు పనిదినాలను లక్ష్యంగా విధిస్తున్నది. ఒక్కో ఏడాది కేటాయించిన పనిదినాలు పూర్తికాకపోగా, మరొక ఏడాది కేటాయిం చిన పని దినాలు పూర్తయితే, అదనపు పనిదినాలను కల్పించారు. ప్రతి ఏటా కేటాయిస్తున్న పనిదినాల్లో ఈ ఏడాది 40 నుంచి 45 శాతం పనిదినాల్లో కోత విధించడంతో ఉపాధిహామీ కూలీలు లబోదిబోమం టున్నారు. కేవలం 13.99 పనిదినాలను మాత్రమే కేటాయించడం గమనార్హం. గత ఐదేళ్లలో చేపట్టిన పనిదినాలతో పోలిస్తే ఈ ఏడాది కేటాయించిన పనిదినాలు చాలా తక్కువ. 2020-21లో 27.43 లక్షల పని దినాలను కూలీలు సద్వినియోగం చేసుకున్నారు. 2021-22లో 25.60 లక్షల పనిదినాలు, 2022-23లో 23.27 లక్షల పనిదినాలు, 2023-24లో 20.61 లక్షల పనిదినాలు, 2024-25లో 25.55 లక్షల పని దినాలను ఉపాధి హామీ కూలీలు పనిదినాలను సద్వినియోగం చేసుకున్నారు. పనిదినాలను తగ్గించడంపై ఉపాధి కూలీలు మండిపడుతున్నారు.

● గ్రామాల్లో తగ్గనున్న అభివృద్ధి పనులు..

కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీల పని దినాల్లో కోత విధించడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు తగ్గనున్నాయి. కూలీలకు ఎన్నిపనులు కల్పిస్తే అందులో 40 శాతం నిధులను శాశ్వత నిర్మాణ పనులకు ఉపయోగించుకుంటున్నారు. గ్రామాల్లో మౌలికవసతులు కల్పించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులను

(మిగతా 8వ పేజీలో)

విద్యార్థినులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అభినందించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నిపుణులైన అధ్యాపకులు విద్యార్థులకు బోధనలు చేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకుంటూ ఉన్నత భవిష్యత్తును పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్‌కౌర్, పలువురు అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

నల్లాలకు ఆన్ ఆఫ్ వాల్వ్ బిగించుకోవాలి

రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతీ రోజు మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టామని, ఇందుకుగాను చివరి నల్లా కనెక్షన్‌కు నీరు వచ్చే విధంగా ప్రతీ నల్లాకు ఆన్ ఆఫ్ వాల్వ్‌ను వినియోగదారులు బిగించుకోవాలని రామగుండం కమిషనర్ అరుణశ్రీ సూచించారు. ప్రతీరోజు నల్లాల ద్వారా నీటి సరఫరా చేయలనే లక్ష్యంతో కార్పొరేషన్ పరిధిలో బీ పవర్‌హౌస్, అల్లూరు ట్యాంకులు మినహా అన్ని ట్యాంకుల పరిధిలో ట్రయల్ రన్ చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతీరోజు నీటి సరఫరా చేసి కనీసం 45నిమిషాలు రక్షిత మంచినీరు ఇవ్వాలనేదే లక్ష్యమన్నారు. టేలెండ్ ప్రాంతాల్లోని కనెక్షన్లకు ఇబ్బంది కాకుండా ప్రజలు తమ అవసరం ఉన్నంత వరకు మాత్రమే నీటిని వాడుకుని తరువాత నల్లాలను ఆపివేయాలని సూచించారు.

కొందరు నల్లా నీరు వచ్చే సమయాల్లో విద్యుత్ మోటార్లు అమర్చి నీటిని లాగుతున్నారని, తద్వారా దిగువ ప్రాంతాలకు నీటి సరఫరా జరుగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వెంటనే మోటార్లు తొలగించాలని ఆమె ఆదేశించారు. విద్యుత్ మోటార్ల తనిఖీ కి బృందాలను నియమించామని, ఈ బృందాలు వచ్చినప్పుడు మోటార్లు కనిపించినా, ఆన్ ఆఫ్ కంట్రోల్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. నల్లా కనెక్షన్ తొలగించడంతో పాటు భారీ జరిమానా విధిస్తామన్నారు. ప్రతీ రోజు నీటి సరఫరా జరిగే విధంగా ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ కోరారు.

నాగేపల్లిలో డీపీవో పర్యటన



పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో

రామగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లిలో డీపీవో వీరబుచ్చయ్య శుక్రవారం పర్యటించారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని ఓపెన్‌ప్లాట్స్‌పై విచారణ చేపట్టారు. ఆయన వెంట డీఎల్‌పీవో సతీష్‌కుమార్, ఎంపీవో ఉమేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



వడుకాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నిర్వాహకులకు సూచించారు. మండలంలోని వడుకాపూర్, కాచాపూర్, వెంకట్రావుపల్లి, కీచులాటపల్లి, కుమ్మరికుంట గ్రామాల్లో సింగిల్ విండోల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, కార్యదర్శులు రవిందర్‌రెడ్డి, గీస సురేష్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● **కోట్లు కొల్లగొట్టిన బీఆర్‌ఎస్ నాయకులు**

కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): ధరణిపేరుతో బీఆర్‌ఎస్ నాయకులు కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో కలెక్టర్‌తో కలిసి ఇందిరమ్మ మోడల్‌హౌస్ ప్రారంభించి అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరణి పోర్టల్ రాష్ట్రమంతా తీసుకువచ్చి ప్రభుత్వ భూములు అన్ని బీఆర్‌ఎస్ నాయకులు కబ్జా చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్, సింగిల్ విండో చైర్మన్లు రామిడి తిరుపతిరెడ్డి, చదువు రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య పాల్గొన్నారు.

నేడు పెద్దపల్లిలో భూభారతిపై అవగాహన సదస్సు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగంపల్లి ఆర్‌ఆర్ గార్డెన్ లో భూ భారతిపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరవుతున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

3న రేషన్ బియ్యం వేలం

పెద్దపల్లి, టౌన్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యం(దొడ్డు బియ్యం) కలెక్టర్ ఆదేశాల మేరకు మే 3న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి తహసీల్దార్ డి రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 61 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి పెద్దపల్లి సివిల్ సప్లై గోదాంలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనేవారు రెండువేల రూపాయలు ధరావత్తు చెల్లించి ఉదయం 10 గంటలకు పాల్గొనాలని కోరారు.

రైతుల మేలుకోసమే భూ భారతి

కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష, వేదికపై ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైతుల మేలు కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మండల కేంద్రంలో భూభారతి చట్టంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గతంలో ఉన్న ఆర్‌వోఆర్ 2020 ధరణి చట్టాన్ని రద్దుచేసి కీలక అంశాలను పొందుపరిచి రాష్ట్ర ప్రభుత్వం భూభారతిని అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. భూసమస్యలకు ఈచట్టం ద్వారా మార్గం దొరుకుతుందన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకొని భూహక్కులు పొందాలని సూచించారు. భూభారతిలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని, సాదాబైనామాలకు కూడా పరిష్కారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు, అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు, ఎంపీడీవో పూర్ణచందర్, మార్కెట్‌చైర్మన్ రామడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వేణు సూచించారు. పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిందన్నారు.ఈ చట్టాన్ని రైతులు,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దమళ్ల జ్యోతి, ఎంపీడీవో కలికోట రామ్‌మోహనచారి, మండల ప్రత్యేక అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, కన్నాల ప్యాక్స్ చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి నూర సమ్మయ్య పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్



భారత్ సమ్మిట్‌లో నూలు వడుకుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్-2025 కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు కేవలం ఓటర్లుగానే కాకుండా శక్తివంతమైన నాయకులుగా ఎదిగి పారదర్శకత, సేవా దృక్పథం, నైతిక విలువలకు ఆధారంగా రాజకీయాల్లోకి ప్రవేశించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువ నాయకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, దీనికి రామగుండం నియోజకవర్గం నుంచిపెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆధ్వర్యంలో కనీవిని ఎరుగని రీతిలో ఈ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, గోపు ఐలయ్య, బొడ్డు రవీందర్, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత, చెలుకలపెల్లి శ్రీనివాస్, అచ్చె వేణు, నట్టు శ్రీనివాస్, తిరుపతి, శ్రావణ్, కోడి రామకృష్ణ, జక్కుల తిరుపతి, రామరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

వెంటాడిన విధి..

● 21 రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి



ఎల్లవ్వ, నరేందర్, నర్సయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్న ఓ కుటుంబంపై విధి కన్నెర్ర జేసింది. అనారోగ్యం, ఆత్మహత్య రూపంలో 21రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలోని ముగ్గురిని కబళించింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ఈనెల 3న గడ్డి నర్సయ్య(55) అనారోగ్యంతో చనిపోయాడు. కుటుంబ పెద్ద మరణం నుంచి తేరుకోక ముందే నర్సయ్య కొడుకు నరేందర్(24) మండల కేంద్రంలో ఓ మహిళ తనపై తప్పుడు కేసు నమోదు చేయించి జైలుకు వెళ్లడానికి కారణమైందని మనస్థాపంతో ఈనెల 22 ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రీకొడుకులు చనిపోయిన బాధ నుంచి కోలుకోక ముందే నర్సయ్య తల్లి గడ్డిఎల్లవ్వ(80) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. ఐదుగురు నివసిస్తున్న ఇంటిలో ముగ్గురు చనిపోవడంతో నర్సయ్య భార్య లక్ష్మీ, పెద్ద కొడుకు నవీన్‌లు మిగిలారు. 21రోజుల వ్యవధిలో ముగ్గురు మృతిచెందడం స్థానికంగా విషాదం నింపింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రబోర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌కు చెందిన చెవుల రాజలింగయ్య(62) తన ద్విచక్రవాహనంపై ఊత్కూర్ చౌరస్తా నుంచి ఆంధ్రబోర్‌లోని తనకుమారుని వద్దకు వెళ్తుండగా వెనుకాల నుంచి ఓకారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని లక్షెటిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైనవైద్యంకోసం కరీంనగర్ తరలించగా అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నలుగురుపిల్లలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

యువతి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం... పెద్దపల్లి జిల్లా పాలితం గ్రామానికి చెందిన బాసిల్లి ఝాన్సీ(23) ఓప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా విధులు నిర్వర్తిస్తోంది. ఇద్దరు స్నేహితులతో కలిసి జ్యోతినగర్‌లో ఒక గదిలో ఉంటోంది. గురువారం రాత్రి భోజనం అనంతరం ఆమె గదిలోనే ఉండగా స్నేహితులు నిద్రించడానికి బిల్డింగ్‌పైకి వెళ్లారు. వారికి పరిచయం ఉన్న అజయ్ అనే వ్యక్తి వారికి ఫోన్ చేసి ఝాన్సీ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పడంతో కిందికి వచ్చి చూశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. ఝాన్సీ మృతిపై తమకు అనుమానాలున్నాయని మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అలంకారప్రాయంగా..

● వినియోగంలోకి రాని నూతన అంగన్‌వాడీ భవనాలు ● ఆటలకు దూరమవుతున్న చిన్నారులు





నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు, చిన్నారులకు అందుబాటులోకి రాని క్రీడా పరికరాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వసతులతో ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఒకే ప్రాంగణంలో అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను గత ప్రభుత్వం నిర్మించినా వినియోగంలోకి రాకుండా పోయాయి. ఫలితంగా చిన్నారులకు ఆటలు దూరమవుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాల భవనాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా గత సర్కారు ఆధునిక వసతులతో నిర్మించింది. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు విద్యను అందిస్తున్నా.. అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం స్థానిక పురాతన పాఠశాల గదుల్లోనే కొనసాగిస్తున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల కోసం ప్రత్యేక వసతులు కల్పించిన ప్రయోజనం లేకుండాపోతోంది. అంగన్‌వాడీ కేంద్రం-2, 3లోని పిల్లలు అరకొర సౌకర్యాల నడుమ అవస్థలు పడుతున్నారు. విశాలమైన భవనాలు, ఆట వస్తువులు ఉన్న నూతన భవనాల్లోకి అంగన్‌వాడీ కేంద్రాలను తరలించడం లో సంబంధిత శాఖ అధికారులు అభ్యంతరమేమిటని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతన భవనాల్లోకి తరలించి ఆటపాటలతో కూడిన విద్య అందేలా చూడాలని కోరుతున్నారు.

నూతన భవనాల్లోకి కేంద్రాలను తరలించేలా చర్యలు..

లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల ప్రాంగణంలో ఉన్న నూతన భవనాల్లోకి తరలించేలా చర్యలు చేపడుతున్నాం. చిన్నారులు, తల్లులకు ఆధునిక వసతులు, ఆటలు అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. గతంలో పాఠశాల ప్రాంగణంలోకి కేంద్రాలను తరలిస్తే తల్లులు, గర్భిణులు భోజనం చేసేందుకు దూరమవుతుందనే కారణంతో పురాతన పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశాం. అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు, స్థానికులతో చర్చించి కేంద్రాలను నూతన భవనాల్లోకి మార్చుతాం.

తూకంలో జాప్యం.. రైతుల పడిగాపులు



ప్రభుత్వ కేంద్రంలో కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో జాప్యం వల్ల రైతులు పడిగాపులు కాస్తున్నారు. తూకంలో ఆలస్యం.. మేఘాలు కమ్ముకుంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు. ఇదేఅదనుగా భావించి ప్రైవేటువ్యాపారులు కేంద్రాల్లో వాలుతున్నారు. క్వింటాలుకు రూ.1750 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ప్రైవేటుపరం అవుతున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేసి ప్రభుత్వ మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్ఎంపీ ఆత్మహత్య

మేడిపల్లి, ఏప్రిల్ 25: అనారోగ్యం కారణంగా ఓ ఆర్ఎంపీ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లికిచెందిన ఆర్ఎంపీ సంబారు జగదీష్ బాబు(44) మూడు సంవత్సరాల నుంచి తీవ్రమైన మెడనొప్పితో బాధపడుతున్నాడు. నాలుగునెలల క్రితం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అపరేషన్ చేయించుకున్నాడు. కానీ మెడనొప్పి తగ్గలేదు అపరేషన్ కోసం రూ.5లక్షల వరకు ఖర్చు అయింది. అనారోగ్యంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య రూపాశ్రీ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ మధుకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గొర్రెల దొంగతనానికి యత్నం

హుజూరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని దమ్మక్కపేటలో గురువారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరువ్యక్తులు గొర్రెల దొంగతనానికి ప్రయత్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు మేతకోసం దమ్మక్కపేటకు వచ్చి మందను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి గొర్రెలు అరవడంతో కాపరులు లేచి చూడగా ఇద్దరు వ్యక్తులు గొర్రెల వద్ద కనిపించారు. వారిలో ఒకరిని పట్టుకోగా, మరో వ్యక్తి పరారయ్యాడు. అతడిని హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గొర్రెల కాపరి యజమాని బీరప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. నెల రోజులుగా 40 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బీరప్ప వాపోయాడు.

అంగన్‌వాడీ టీచర్‌పై తేనెటీగల దాడి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్‌పై తేనెటీగలు దాడిచేశాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల సరోజన అనే అంగన్‌వాడీ టీచర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వచ్చి దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన సరోజనను స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు..

తంగళ్లపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో విద్యుత్‌స్తంభానికి కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న కారు సారంపల్లి గ్రామశివారులో మూలమలుపు వద్ద విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న సాగర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా, విద్యుత్ స్తంభం విరిగి కింద పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. కారు యజమాని సెస్‌కు నష్టపరిహారం కింద రూ.10వేలు చెల్లించాడు. రెండు గంటల తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

● 250 గ్రాముల బంగారు ఆభరణాలు, భారీగా నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలో చోరీకి పాల్పడిన కేసుల్లో చిగురుమామిడి మండలం నవాబ్‌పేటకు చెందిన కంది సంపత్‌రెడ్డి, వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన సూర రవిని అరెస్టు చేసినట్లు, వారి వద్ద 250 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. శుక్రవారం కరీనంరగ్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నవాబ్ పేటకు చెందిన సంపత్‌రెడ్డి కరీంనగర్ బస్టాం డ్‌లో ఫిబ్రవరి 14న మహిళ బ్యాగ్ నుంచి 16.5 తులాల బంగారం, ఫిబ్రవరి 24న మరో మహిళా బ్యాగ్ నుంచి 47 గ్రాముల బంగారం, ఏప్రిల్ 8న ఓ వృద్ధుడి బ్యాగ్‌లో నుంచి 13 లక్షల నగదు చోరీచేశాడు. నిందితుడు శుక్ర వారం కమాన్‌చౌరస్తా వద్ద అనుమానా స్పదంగా కనిపించగా ఒకటో టౌన్ సీఐ కోటేశ్వర్ అదుపులోకి తీసుకొని విచారించారు. బస్టాండ్‌లో చోరీలకు పాల్పడు తున్నట్లు వెల్లడైంది. నర్సంపేటకు చెందిన సూర రవి ఏప్రిల్ 13న సప్తగిరి కాలనీలోని ఒక ఇంటిలో చొరబడి 175 గ్రాముల బంగారం, రూ.35వేల నగదును ఎత్తుకెళ్లాడు. పద్మనగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా రెండో టౌన్ సీఐ సృజన్‌రెడ్డి అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు.

అతడివద్ద నుంచి 100గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బంగారం, నగదును సీజ్ చేసినట్లు, ఇద్దరిని కోర్టులో హాజరుపర్చను న్నట్లు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకొని సొత్తును రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన టౌన్ ఏసీపీ వెంకటస్వామితోపాటు సీఐలు బిల్ల కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బందిని అభినందించారు.

ఎస్‌యూ స్టోర్‌రూంలో అగ్ని ప్రమాదం



స్టోర్ రూం సమీపంలో కాలిపోయిన చెట్లు



దగ్ధమవుతున్న పేపర్లు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం స్టోర్ రూంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవిం చింది. ప్రమాదంలో ఎస్‌యూకు చెందిన దిద్దిన పరీక్షపేపర్లు దగ్ధమ య్యాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ఆన్సర్ పేపర్లు ఈ మంటల్లో దగ్ధమైనట్లు జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదంపై కొత్తపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. గురువారం ఉదయం నుంచిరాత్రి వరకు ఫైర్ సిబ్బంది 4ఫైరింజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వారు వెళ్లిన అనంతరం వేకువజామున మళ్లీ మంట లు చెలరేగడంతో అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.

బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఎండీ అంకుస్(78) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంత కాలంగా అంకుస్ మానస్థితి సరిగలేదు. శుక్రవారం ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న వ్యవసాయ బావిలోపడి నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కూమారుడు ఎండీ ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరి మృతి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి సమీపంలో నివాసం ఉంటున్న గొల్లపెల్లి జగన్ గౌడ్(38) అనే యువకుడు వడదెబ్బతో మృతిచెందాడు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తట్టుకోలేక వడదెబ్బ తగిలి మృతిచెందాడు. మృతునికి భార్య జల, ఇద్దరు చిన్నారులు నిక్షిత, నిత్యశ్రీ ఉన్నారు. జగన్‌గౌడ్ మృతితో కుటుంబీకులు తీవ్రంగా విలపిస్తున్నారు.



వెంకన్న (ఫైల్)

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలానికి చెందిన వొల్లాల వెంకన్న(55) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. వెంకన్న జీప్ నడిపిస్తుంటాడు. గతంలో పక్షవాతం రావడంతో ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవలే ఆరోగ్యం కుదుటపడింది. మధ్యాహ్నం భోజనం చేసి బయటకు కాలినడకన వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందాడు. ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంజాల సమ్మయ్య తనను వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కథనం ప్రకారం.. వివాహిత పిల్లలతో ఒంటరిగా ఇంటిలో ఉండగా సమ్మయ్య ఇంటికి వెళ్లి తన కోరిక తీర్చాలని వేధింపులకు గురిచేశాడన్నారు. ఈ మేరకు సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

● కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం..



సుద్దాలలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి కవర్లు కప్పుతూ ఇబ్బందులు పడుతున్న రైతులు

కోనరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండ డంతో.. అన్నదాత్లో గుబులు రేగుతోంది.. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మూలుగుతుండ డంతో కుప్పలను కాపాడుకోవ డానికి రైతులు పాట్లు పడుతు న్నారు. కోనరావుపేట మండలం లో శుక్రవారం సాయంత్రం మబ్బులు కమ్ముకోవడంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో మబ్బులు కమ్ము కొని ఈదురుగాలులు రావడంతో వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతులు నానా ఇబ్బందిపడ్డారు. ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా కవర్లు లేకపోవడంతో ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అప్పుల బాధ భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

మంథనిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఆకుల రాజేష్(32) అనే యువకుడు శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంథని పోలీసుల కథ నం ప్రకారం.. గుంజపడుగు గ్రామానికి చెందిన రాజేష్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని కుమారుడికి అరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స కోసం అప్పులుచేశాడు. అప్పులుతీర్చే దారిలేకపోవడంతో గురు వారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానానికి పాల్పడ్డాడు. గమ నించిన కుటుంబసభ్యులు చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య అకుల లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడిన దంపతులపై కేసు

చందుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూమి హద్దురాళ్ల తొల గింపు విషయంలో ఓ వ్యక్తిని చంపుతామని బెదిరించిన ఘటనలో దంపతులపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై అంజయ్య శుక్రవారం తెలిపారు. ఎస్సైకథనం ప్రకారం.. కొనరావుపేట మండ లం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాటిపెల్లి రాజిరెడ్డికి చందుర్తి మండలం ఎనగల్ గ్రామశివారులోని సర్వే నంబర్ 427లో 10 గుంటల భూమి ఉంది. కొంత భూమి చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికిచెందిన గుండెకర్ల తిరుపతికి సంబం ధించిన భూమిలో అదనంగా ఉన్నట్లు సర్వేయర్ గుర్తించారు. సర్వేయర్ నిర్ణయించిన భూమికి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. తిరుపతి హద్దురాలను తొలగించడంతో ఇద్దరి మధ్య గొడవ తలెత్తింది. హద్దురాళ్లను తొల గించి చంపేస్తామని బెదిరింపులకు పాల్పడిన ఎన్గల్ గ్రామానికి చెందిన గుండెకర్ల తిరుపతి-విజయ దంపతులపై రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి

● గంగాధర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీచేసిన సీపీ గౌస్ ఆలం



కేసుల రికార్డులను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

గంగాధర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేకనిఘా ఉంచి వారికదలికలను గమనిస్తుండాలని సీపీ గౌస్‌ఆలం అన్నారు. శుక్రవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షనిర్వహించారు. కేసులు పెండింగ్‌కుగల కారణాలను అడిగి తెలుసుకుని వాటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని, సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజలతో మమేకం కావాలని ఆదేశించారు.ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామానికి ఒక ప్రత్యేక పోలీస్‌సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. గంజాయి రవాణా, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్‌బియ్యం రవాణా, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈసందర్భంగా స్టేషన్ సిబ్బందితో ఆయన ముచ్చటించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో ఎస్ఐ వంశీకృష్ణ, ఇతర సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

రేఖది హత్యే: సీఐ శ్రీనివాస్‌గౌడ్

గంభీరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గజసింగవరంలో చెరుకూరి రేఖది అనుమానాస్పద మరణం కాదని, హత్యేనని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అత్యాచారయత్నంలో శ్రీకాంత్ రేఖను హత్య చేశాడని సీఐ వెల్లడించారు. గజసింగవరం ఘటనపై సీఐ శ్రీనివాస్‌ను వివరణఅడగా, రేఖది హత్యేనని తెలిపారు. రేఖను హత్య చేసిన అనంతరం భయంతో శ్రీకాంత్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తన భార్యను శ్రీకాంత్ అనే వ్యక్తి హత్య చేశాడంటూ మృతురాలి భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు చేశాడని సీఐ వెల్లడించారు.

మత విభజనలు దేశానికి ప్రమాదకరం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్‌వీరయ్య

భగత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మత విభజనలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్‌వీరయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగ్రవాదాన్ని ఐక్యంగా అంతమొందించాలన్నారు.పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత అమానుష, హేయమైన చర్య అని, దేశ ప్రజలు ఒక్కటిగా ఎదుర్కొని టెర్రరిజాన్ని తుద ముట్టించాలన్నారు. ఘటనపై లోతైన దర్యాప్తు జరపాలన్నారు.

కాశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందని ప్రధాని, హోంమంత్రి ప్రకటించారన్నారు. పెద్ద నోట్ల రద్దు సందర్భంగా కూడా నకిలీ నోట్లు టెర్రరిస్టులకు అందుబాటులో లేకుండా చేయాలనే నోట్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రకటనలకు ఆచరణలకు పూర్తి విరుద్ధంగా కాశ్మీర్‌లో పరిస్థితులు ఉన్నాయన్నారు. దేశంలోని 143 భారత పౌరులను ఐక్యంగా నిలబెట్టాల్సిన తరుణంలో మతపరమైన సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఉగ్రవాదుల నుండి తుపాకి లాక్కునే ప్రయత్నంలో హార్స్ రైడర్‌ను కాల్చి చంపారని, ఆ యువకుడు ఒక ముస్లిం అని మర్చి పోకూడదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 500 బోనస్ చెల్లించాలన్నారు.

కిషన్ రెడ్డి బొగ్గు శాఖ మంత్రి ఉండగానే సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేశారన్నారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి తేడా లేదన్నారు. సింగరేణిని కాపాడుకునే సోయి ఈ మూడు పార్టీలకు లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమా సాహెబ్, యు శ్రీనివాస్, డినరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వీరయ్య, పాల్గొన్న సీపీఎం నాయకులు



తునికాకు సేకరణపై సన్నగిల్లుతున్న ఆసక్తి

- కూలీలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు
- ఆకు, కూలీలు లేక టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- జిల్లాలో అమ్ముడుపోని తునికాకు యూనిట్లు
- 7 యూనిట్లకు 3 యూనిట్లలోనే టెండర్లు పూర్తి
- 28 కళ్లాల్లో ఆకుల సేకరణ బంద్, జిల్లా లక్ష్యం 7600 ఎస్‌బీలు
- మే తొలి వారంలో ఆకు సేకరణ, గతేడాది 50 ఆకుల కట్టకు రూ. 3

మంథని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లోని గ్రామీణ కూలీలకు వేసవిలో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న తునికాకు సేకరణపై ఆసక్తి సన్నగిల్లుతోంది. పదేళ్ల క్రితం వరకు యేటా తునికాకు సీజన్‌లో వచ్చే ఆదాయంతో కుటుం బంలో ముఖ్యమైన కార్యక్రమాలను గట్టెక్కించునే వారు. రాను రాను గ్రామీణులు ఆకు సేకరణకు ముందుకు రావడం లేదు. యేటా అడవులు, గుట్టలు అంతరించిపోవడం, ఆకు లభ్యం కాకపోవడం, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు స్థానికంగా అందుబాటులోకి రావడంతో పల్లె జనం తునికాకు సేకరణపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాలకు తోడు నాణ్యమైన తునికాకు లభ్యం కాకపోవడంతో యూనిట్ల కోసం టెండర్లు వేసే కాంట్రాక్టర్లు సైతం ముందుకు రావడం లేదు. గతంలో తునికా కు యూనిట్ల కోసం కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్లు దక్కించు కునే వారు. ప్రస్తుతం పరిస్థితి క్రమంగా తగ్గుతూ వస్తుంది.

మంథని, పెద్దపల్లి ఫారెస్టు రేంజి పరిధిలో మంథని-1, ఖమ్మంపల్లి, ముత్తారం-ఏ, ముత్తారం-బీ, రామగుండం, పెద్దపల్లి, కల్వచర్ల యూనిట్లు ఉండగా వాటిలో తునికాకు సేకరణ కోసం ప్రభుత్వం ద్వారా అటవీ శాఖ టెండర్లు ఆహ్వానించగా ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, కల్వచర్ల కేవలం మూడు యూనిట్లనే కాంట్రాక్టర్లు తీసుకున్నారు. మిగితా 4 యూనిట్లలో ఆకు సేకరణకు కాంట్రాక్టర్లు టెండర్లు తీసుకులేదు.

జిల్లాలోని 7 యూనిట్లలో 47 ఆకుల కళ్లాలు, 7600 స్టాండర్ బ్యాగ్‌ల టార్గెట్ ఉండగా వాటిలో ఈ సంవత్సరం 3 యూనిట్లలో మాత్రమే టెండర్ ప్రక్రియ ముగియడంతో వాటి పరిధిలోని 18 కళ్లాల్లో ఆకు సేకరణ జరగనుంది. మిగితా 29 కళ్లాలల్లో ఈఏడు ఆకు సేకరణ జరగడం లేదు. ముత్తారం యూనిట్ పరిధిలోని దర్యాపూర్, హరిపురం, కేశనపల్లి, మచ్చుపేట, మైదంబండ, పారుపల్లి గ్రామాల్లో 900 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా ఆకుల కళ్లాలు ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మంపల్లి యూనిట్ పరిధిలోని చిన్నఓదాల, ధర్మారం, గోపాల్‌పూర్, జీల్లపల్లి-ఏ, జిల్లలపల్లి-బీ, ఖమ్మంపల్లి-ఏ, ఖమ్మంపల్లి-బీ, సీతంపల్లి గ్రామాల్లో 1700 స్టాండర్ బ్యాగుల లక్ష్యం. కల్వచర్ల యూనిట్ పరిధిలోని గౌరెడ్డిపల్లి, రత్నాపూర్, సబితం, వెన్నంపల్లి గ్రామాల్లో 200 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా కళ్లాలు ఏర్పాటు చేయనున్నారు. 50 ఆకుల కట్టకు రూ. 3 గత ఏడాది కాంట్రాక్టర్లు కూలీలకు చెల్లించారు. ఈఏడాది ఇంకా కట్ట రేట్ నిర్ణయించలేదు. వెయ్యి ఆకు కట్టలు ఒక స్టాండర్ బ్యాగ్‌గా లెక్కిస్తారు. మే తొలి వారంలో టెండర్లు పూర్తయిన ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, కల్వచర్ల యూనిట్ల పరిధిలోని 18 కళ్లాల్లో తునికాకు సేకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. యూనిట్ల పరిధిలోని ఆయా అటవీ గ్రామాల్లో వారం లేదా 10 రోజుల పాటు తునికాకు సీజన్ సందడి కొనసాగనుంది.

కాలిబూడిదైన ఈతవనం

మూడు వేలకుపైగా చెట్లు దగ్ధం



బండలింగాపూర్ శివారులో కాలిపోయిన ఈత చెట్లు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని శుక్రవారం ఈతవనం దగ్ధమైంది. గ్రామ శివారులో గీత కార్మికులు మూడు ఎకరాలలో ఈత చెట్లను పెంచుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉండవచ్చునని స్థానికులు పేర్కొంటున్నారు. అగ్నిప్రమాదం తెలిసిన వెంటనే గీత కార్మికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈతచెట్లు కాలి బూడిదయ్యాయని గౌడ కులస్తులు పేర్కొన్నారు. ఈత వనం దగ్ధం కావడంతో ఉపాధి కరువవుతుందని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంబయ్యపల్లి శివారులోని గర్రెపల్లి చెరువులో గుర్తుతెలియని మహిళ(45) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ మృతదేహం కుళ్లినస్థితిలో ఉంది. జీన్స్ ప్యాంట్, మూడు షర్టులు వేసుకొని ఉంది. ఆమె ప్యాంట్ జేబులో మధ్యప్రదేశ్‌కు చెందిన లేఖన్‌సింగ్ పేరుతో ఉన్న పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన డెబిట్‌కార్డు లభ్యమైంది. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా ఎస్ఐ సెల్ నంబర్ 8712656511కు సమాచారం అందించాలని ఎస్ఐ శ్రావణ్‌కుమార్ సూచించారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించే సభకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండలంలోని సింగాపూర్, చిన్న పాపయ్యపల్లి, కందుగుల గ్రామాల్లోని చెట్లకు పార్టీ రంగులువేసి పర్యావరణానికి హాని కలిగించారని దీనిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం యువజన కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యక్ర మానికి చెట్లను వాడుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చెట్లకు వేసిన పార్టీ వేసి రంగులపై తెలుపురంగు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఉమ్మడి సందీప్, పంజాల అరవింద్, సుమన్ తదితరులు ఉన్నారు.

సీజేరియన్లు తగ్గించి..

సహజ ప్రసవాలను ప్రోత్సహించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీజేరియన్లు తగ్గించి.. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, , జమ్మికుంట జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవుట్‌రీచ్ కేంద్రాల్లో ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులు నిర్వహించి మహిళలందరికీ స్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధు, జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్, జమ్మికుంటలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేష్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట పీహెచ్‌సీలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కూలర్లు, డ్రమ్ములు, పాతటైర్లు, తదితర వాటిలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్‌లో వేసవి కాలానికి సంబంధించి మందుల నిల్వలను, లేబరేటరీ, ఎన్సీడీ క్లీనిక్‌లను సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ కల్యాణ్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





హుజూరాబాద్‌లో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, ఇల్లందకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శాతవాహనలో ఎంఫార్మసీ పరీక్ష వాయిదా

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నె 28 నిర్వహించనున్న ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్ష వాయిదా వేసినట్లు విశ్వ విద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. అదే రోజున ఆర్ఆర్‌బీ పరీక్ష ఉందని, ఎం ఫార్మసీ పరీక్షను 29కి వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ కృషి

ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా

జ్యోతినగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ రాజీలేని పోరాటం చేస్తున్నదని యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బాబర్ సలీంపాషా తెలిపారు. శుక్రవారం ఎన్టీపీసీ పీటీ ఎస్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబర్ మాట్లాడారు.



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందిన ఐఎన్‌టీయూసీ సంఘ టిత, అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తున్నదన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. నూతన కార్యవర్గం జిల్లాలో అన్నివర్గాల కార్మికుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తుందన్నారు. ప్రధానంగా ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్‌తోపాటు అసంఘటిత రంగంలోని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, బీడీ కార్మికులు తదితర కార్మికుల కోసం పనిచేస్తుందన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెకు జిల్లా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అన్ని యూనియన్లతో సమన్వయం చేసుకొని సమ్మె విజయవంతానికి కృషి చేస్తామని బాబర్ తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బూమళ్ల చందర్, ప్రధాన కార్యదర్శి విజయ్ మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ పెద్దపల్లి జిల్లా కమిటీ..

ఐఎన్‌టీయూసీ పెద్దపల్లి జిల్లా కార్యవర్గాన్ని యూనియన్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూమళ్ల చందర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ మోహన్, ఉపాధ్యక్షులుగా నీరటి శంకర్, మేకల సతీష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా కుల్ల వెంకటేశ్వర్లు, కనకయ్య, జునుతుల సమ్మిరెడ్డి, కొమరయ్య, కోశాధికారిగా సురేందర్, జాయింట్ సెక్రెటరీలుగా నయీంపాషా, బొద్దున శీనివాస్, ఎండీ జమీల్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బడి భద్రత ఎలా?

- పాఠశాలలకు ప్రారంభమైన వేసవి సెలవులు
- ప్రభుత్వ పాఠశాలల్లో విలువైన సామగ్రి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలలకు రాత్రి పూట కాపాలాదారుల లేక రక్షణ కరువైంది. వేసవిసెలవులు ప్రారంభమయ్యాయి. దీంతో విలువైన కంప్యూటర్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, టీవీలు, బెంచీలు, ల్యాబ్ పరికరాలు ఇతర సామగ్రి భద్రత అధికారులకు ప్రశ్నార్థకంగా మారింది. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఇలాంటి చోట్ల చోరీలు జరగడానికి ఎక్కువగా అవకాశం ఉంది. ఏ పాఠశాల లోనూ సీసీ కెమెరాలు లేవు. కిటికీలు, తలుపులు కూడా సరిగ్గా లేకపోవడం సమస్యగా మారింది. పలు చోట్ల ప్రభుత్వ పాఠ శాలల్లో అసాంఘిక కార్యకలా పాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యా ర్థులు టెక్నికల్‌స్కిల్స్ పెంపొందించడానికి కొన్ని సంస్థలు ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు, విలువైన తరగతి సామగ్రిని అందజేశారు. వాటి భద్రత ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది.



బెల్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కాపాలాదారులను నియమించాలి..

వేసవి సెలవులు ముగిసే వరకు తాత్కాలిక పద్ధతిలోనైనా ఉన్నతపాఠశాలలకు కాపలాదారులను నియమించాలి. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు కూడా కొంత బాధ్యత అప్పగిస్తే మేలు. కంప్యూటర్లు ఉంచిన గదులకు తలుపులు, కిటికీలు పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి. పాఠశాల ఆవరణల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

అందరూ కలిసి కాపాడుకోవాలి..
భూపతి శ్రీనివాస్, ఎంఈవో,
హుజూరాబాద్



ఉన్నతపాఠశాల్లో కంప్యూటర్లు ఉన్నాయి. భద్రత ఉన్న గదుల్లోనే కంప్యూటర్లు ఉన్నాయి. గ్రామాల్లో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు వేసవి సెలవుల్లో పాఠ శాలలపై ఓ కన్నేసి ఉంచాలి. పాఠశాలల ఆస్తులను అందరూ కలిసి కాపాడుకోవాలి.

చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి



దత్తత తీసుకున్న దంపతులకు ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహంలో పెరుగుతున్న ఆరునెలల శిశువును పూణేకు చెందిన దంపతులు రెండు నెలల క్రితం దత్తత ఇచ్చారు. ఆ దంపతుకు దత్తత ఉత్తర్వులను కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకోవాలన్నుకవారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేష్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన



ఎస్‌యూలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వద్ద చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వారందరూ కొన్ని దశాబ్దాలుగా యూనివర్సిటీ విద్యా వ్యవస్థను తమ బోధనతో కాపాడుకుంటూ వచ్చిన వాళ్లేనని, వారి సేవలను గుర్తించాలని కోరారు.

అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలకు ప్రభుత్వం ఆదేశం

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో.. 11 ఏళ్ల క్రితం జరిగిన ఓ అవినీతి వ్యవహారంలో బాధ్యులైన అధికారుల నుంచి డబ్బులు రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 11 ఏళ్ల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగింది. దీనిపై విచారణ జరిపిన ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పదవీ విరమణ పొందిన అధికారులు మోహన్‌రెడ్డి నుంచి 45 లక్షలు, రాములు నుంచి 11 లక్షలు, రాధమ్మ, సుభద్ర, విజయలక్ష్మి పెన్షన్ నుంచి రెండు శాతం రివకవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సీనియర్ అసిస్టెంట్ జయకృష్ణ నుంచి 24 లక్షలు రికవరీ చేసి అతడిని రివర్షన్ చేసింది. ఏడీ సరస్వతి, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, ధర్మయ్యను మళ్లీ తప్పులు చేయవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమయ్య మాట్లాడుతూ ఐడీసీఎస్‌లో అవినీతికి పాల్పడ్డ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి



సైనీశ్రీ (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన కోమలత-సంతోష్ దంపతుల కుమార్తె సైనీశ్రీ(8) శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెంది. వివరాల్లోకి వెళితే.. సంతోష్ కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారి పక్కన నూతన ఇంటిని నిర్మించాడు. దాని పక్కన సిమెంట్ ఇటుకలతో వాటర్ ట్యాంకును నిర్మించారు. బంధువుల ఇంటిలో ఫంక్షన్ ఉండగా తన చిన్న కుమార్తె వెళ్లగా గురువారం పెద్ద కుమార్తె సైనీశ్రీని తల్లిదండ్రులు కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకులో నీటిని నింపేందుకు తీసుకెళ్లారు. ట్యాంకు పక్కన సైనీశ్రీ ఆడుకుంటున్న సమయంలో ట్యాంకు కూలిపోయి చిన్నారి మీద పడి తీవ్రగాయాల పాలైంది. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందింది. మృతురాలు రెండో తరగతి చదువుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

సిమ్స్‌లో త్వరలో పీజీ కోర్సులు

- కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు



కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (సిమ్స్)లో త్వరలో నాలుగు పీజీ కోర్సులకు అనుమతి లభించనున్నదని ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. సోమవారం శుక్రవారం మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి గాను ఎమర్జెన్సీ మెడిసిన్, బయోమెట్రిక్, గైనకాలజిస్ట్, ఆర్థో పెడిక్ విభాగాల్లో పీజీ కోర్సులకు అనుమతి కోసం జాతీయ వైద్య విద్య కమిషన్‌కు దరఖాస్తు చేశామని, ఈ విద్యాసంవత్సరంలో అనుమతి లభిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. నాలుగు విభాగాల్లో మొత్తం 64సీట్లు వస్తాయని, మరో రెండు విభాగాలు పిడియాట్రిక్, జనరల్ సర్జన్ కోర్సులకు కూడా దరఖాస్తు చేసినట్టు ఆమె చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు, మరిన్ని వసతులు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు, మూడు ఆర్వో ప్లాంట్ల కోసం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. రూ.15లక్షలతో త్వరలోనే జిమ్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రొఫెసర్ రాజు పాల్గొన్నారు.

138మంది విద్యార్థుల ఉత్తీర్ణత

ఇటీవల నిర్వహించిన రెండవ సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్షల్లో 150మందికి గాను 138 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. 28మంది డిటైన్డ్ అయ్యారని, సిమ్స్ మెడికల్ కళాశాలలో 90శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆమె చెప్పారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి







రామగుండం, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి లో ఉగ్రవాది దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ, అఖిల పక్ష నాయకులు, గోదావరిఖనిలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి మృతులకు ఘన నివాళులర్పించారు. భాస్కర్‌రావు భవన్ నుంచి గోదావరిఖని చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ టీ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. సీపీఎం నాయకుడు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలో వీహెచ్‌పీ అధ్యక్షుడు దావ రాజిరెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళుర్పించి మౌనం పాటించారు.

అంతర్గాం: రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదుట పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను శుక్రవారం కుందనపల్లి బీజేపీ గ్రామశాఖ అధ్వర్యంలో దహనం చేశారు.

మంథని: పట్టణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రౌండ్‌లో శుక్రవారం మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంకరి కుమార్, ప్రధాన కార్యదర్శి నాంపెల్లి రమేష్, ఉపాధ్యక్షుడు ఈసంపెల్లి కొమురయ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండలంలోని గర్రెపల్లి లో అఖిల పక్షం, హిందూ ఐక్యత నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

పెద్దపల్లి టౌన్: పట్టణంలో ఎల్ఐసీ ఏజెంట్ల అధ్యర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్దపల్లి ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు సాగి ప్రసాద్‌రావు, ఎల్ఐసీ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఉగ్రదాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు

● జర్నలిస్టుల ఆధ్వర్యంలో..

పెద్దపల్లి టౌన్/రామగిరి/కాల్వశ్రీరాంపూర్/ధర్మారం/ఓదెల (ఆంధ్రజ్యోతి): జమ్మూ-కాశ్మీర్ పహల్గం ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులు పెద్దపల్లి పట్టణం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, ఓదెల మండలం కొలనూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్‌గౌడ్, వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

● ముస్లింల నిరసన..

ఓదెల/పాలకుర్తి: కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ఓదెల మండలం పొత్కపల్లి, పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని మసీద్‌ల్లో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం తమ నిరసన వ్యక్తం చేశారు. నరమేధాన్ని ఇస్లాం ఎప్పుడు క్షమించదన్నారు.



ఓదెల మండలం పొత్కపల్లిలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కార్పొరేట్ కాలేజీలకు దీటుగా చదువు చెప్తాం..

- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకుల ప్రచారం

మంథని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కాలేజీలకు దీటుగా చదువు చెప్తామని తమ కళాశాలలో చేరాలని మంథని ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల అధ్యాపకులు విస్తృత ప్రచారాన్ని చేపడుతున్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మార్కులు సొంతం చేసుకొని 10వ తరగతి పూర్తి చేసిన తల్లిదండ్రుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈకళాశాలలో చదివిన గుండోజు శ్రీజ అనే ఎంపీసీ ఫస్టు ఇయర్ విద్యార్థినికి 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆమె తోపాటు పలువురు విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫలితాల అనంతరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ కళాశాల విద్యార్థినులు సాధించిన అత్యుత్తమ మార్కులను మంథని పట్టణంతో పాటు, పరిసర గ్రామాల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను నిత్యం కలుస్తూ తమ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతున్నారు. ఇంటర్ రెండేళ్ల కోసం కార్పొరేట్ కాలేజీల్లో లక్షలాది రూపాయాలు ఫీజు చెల్లించి ఆర్థికంగా ఇబ్బందులకు గురికావద్దని కోరుతున్నారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా తమ కళాశాలలో అనుభవం కలిగిన ఉత్తమమైన అధ్యాపక బృందం ఉందని, విశాలమైన కళాశాల భవనాలు, తరగతి గదులు ఉన్నాయని, డిజిటల్ విద్యా బోధన, ఉచిత పాఠ్యాపుస్తకాలు, ఉపకార వేతనాలు అందుబాటులో ఉన్నాయంటున్నారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్ మెంట్ తోపాటు భవిష్యత్‌లో ఏఏ కోర్సులకు ఫ్యూచర్ ఉంటుందో, వాటిని ఎలా చదువాలనే విషయాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని చెప్తున్నారు. విద్యార్థుల పై ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించేలా కృషి చేస్తామంటున్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తామని తెలుపుతున్నారు. ఇటీవల జరిగిన 10వ తరగతి వార్షిక పరీక్షల సమయంలో సైతం పరీక్షా కేంద్రాల ఇలాంటి వివరాలతో కూడిన కరపత్రాలను అధ్యాపకులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. ఫేసుబుక్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగ్రామ్‌ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కొద్దిరోజులుగా కళాశాల అధ్యాపకులు చేస్తున్న కృషి మూలంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తుండటంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులు సైతం ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.



మంథనిలో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపక బృందం

పోషణ్ పక్వాడపై అవగాహన

పెద్దపల్లిటౌన్, ఎప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమంపై శుక్రవారం అధికారులు స్థానిక శాంతనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. గర్భిణులకు, పిల్లలకు అందించే పోషకాహారం గురించి పిల్లలకు అంగన్‌వాడీ సిబ్బందికి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. పిల్లలకు పోషకాహారం అందించడం వల్ల వారిలో ఎదుగుదల, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వారు పేర్కొన్నారు. క్రమం తప్పకుండా గర్భిణులు, పిల్లలు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లలకు గర్భిణీలకు ఇవ్వాల్సిన డైట్, పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్ అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేష్ సాగర్, ఆకుల రాజేష్, విష్ణువర్ధన్. మహేందర్, కళ్యాణ్. తిరుపతి, మాజీ కౌన్సిలర్ భిక్షపతి లైశెట్టి అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ అనిత, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వాకర్స్ ఆర్థిక సహాయం

సుల్తానాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద యువకుడు బత్తిని మహేష్ కుటుంబానికి వాకర్స్ అసోసియోషన్ తరపున ఇరవై ఐదు వేల రూపాలయ నగదును అందజేశారు.

శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుడు మహేష్ భార్యకు వాకర్స్ అసోసియేషన్ తరపున మాజీ జడ్పీటీసీ డాక్టర్ రమేష్, రిటైర్డు ప్రభుత్వ హెచ్‌ఎం రాజేంద్ర ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్, బాస్కర్, సుమ న్, మల్లేశం తదితరులు నగదు అందించి తమ ఔధార్యాన్ని చాటుకున్నారు.

మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ నివాస ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గర్రెపల్లి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గర్రెపల్లితోపాటు వివిధ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు సదస్సులు నిర్వహించారు. గర్రెపల్లిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతు దోమ కాటు మూలంగానే మలేరియా సోకుతుదని దాంతో పాటు డెంగ్యూ, బోదకాలు (ఫైలేరియా) తదితర వ్యాధులు వస్తాయన్నారు. తమ పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా, నీరు నిల్వ లేకుండా దోమల వ్యాప్తి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఆశాలు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గర్రెపల్లిలో మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ధర్మారం: ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అనుదీప్, డాక్టర్ సుస్మిత ఆధ్యర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ నర్సింహారెడ్డి, హెచ్‌ఎస్ జీవరాణి, ల్యాబ్ అసిస్టెంట్ రమేష్, హెచ్‌ఏ దామోదర్, ఏఎన్‌ఎం మృణాళిని, ఓఎస్‌డీ మల్లేశం పాల్గొన్నారు.

ఓదెల: మండల కేంద్రంలో శుక్రవారం వైద్యులు ర్యాలీ నిర్వహించారు. దోమలు లేకుండా రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సహబాజ్ ఖాన్ తెలిపారు.

‘ఉపాధి’లో కోత
(5వ పేజీ తరువాయి)

కేటాయిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ ద్వారా నిధులకు కేటాయిస్తున్నది. వీటికి తోడు ఉపాధిహామీ నిధులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు, స్వశక్తి సంఘాల భవనాల నిర్మాణాలు, రైతు వేదికలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీల భవనాలు, తదితర పనులను ఉపాధి హామీ నిధులతోనే చేపడుతున్నారు. ప్రతి ఏటా జిల్లాకు ఉపాధి పనుల ద్వారా 20 నుంచి 25 కోట్ల రూపాయల నిధులను మెటీరియల్ కంపోనెంట్ పనులకు వినియోగించుకుంటున్నారు. కానీ కేంద్రప్రభుత్వం పని దినాలను తగ్గించడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి నెలకొననున్నది.

జాబ్ మేళాకు విశేష స్పందన

సుల్తానాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాణి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలలో శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు వంద మంది పాల్గొన్నారు.వీరిలో 50 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొన్న ఐదు కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిదులు ఎంపిక కాబడిన వారికి ఆఫర్ లెటర్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి విద్యా సంస్థల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక తదితరులు పాల్గొన్నారు.

మే డేను పోరాట దినంగా నిర్వహించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మే 1వ తేదీని పోరాట దిక్ష దినంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు సూచించారు. ఈ సంర్భంగా శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముత్యంరావు మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేసే విధానాన్ని వ్యతిరేకిస్తూ రోజుకు ఎనిమిది గంటల పనిదినం కోసం 1886 సంవత్సరంలో అమెరికా, చికాగో నగరంలో సమ్మెలో భాగంగా ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులపై అక్కడి ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం కాల్పులు జరిపిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మిక హక్కుల, సౌకర్యాల, చట్టాల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించి కష్టజీవులకు ఎర్రజెండా అండగా ఉందన్నారు. అందుకే మేడేను ఉత్సవంగా కాకుండా పోరాట దినంగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. .చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం కోసం జరిగిన పోరాట స్ఫూర్తితో అనేక దేశాల్లో కార్మిక వర్గం ఎర్ర జెండా అండతో తిరుగుబాటు చేసిందన్నారు. భారతదేశంలో కార్మిక వర్గం స్వాతంత్యానికి ముందు, తర్వాత అనేక పోరాటాలు, సమ్మెలు, త్యాగాలు, ఉద్యమాలు నిర్వహించి కార్మిక చట్టాలను సాధించిందని వివరించారు. మే డే నాడు ప్రతి గ్రామ వార్డు బస్తి స్థాయిలో మేడే జెండాలు ఆవిష్కరించాలని కోరారు. మండల, పట్టణ కేంద్రాల్లో ప్రదర్శనలు, సభలు నిర్వహించి, చికాగో అమరుల స్ఫూర్తితో వర్గ పోరాటాలకు సన్నద్ధం కావాలని, ఎర్రజెండా ఔన్నత్యాన్ని ప్రతిబింబించే విధంగా మేడే నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎండి.కాజా, వివిధ యూనియన్ల నాయకులు ఆరెపల్లి చంద్రయ్య, బొంకూరి సాగర్, అంజయ్య, లక్ష్మీ, శారద, పరుష రాములు, ముస్తఫా, సుశీల, పల్లె రవి, బొంకూరి శంకర్, మల్లేశం పాల్గొన్నారు.

‘రాజకీయ లబ్ధికోసం ఆరోపణలు చేస్తే సహించం’

మంథని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంథని మాల నాడు ఐక్య వేదిక నాయకులపై బీఆర్ఎస్ నాయకుడు కొండ రవీందర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాల ఐక్య వేదిక నాయకులు ఆర్ల నాగరాజు, నూకల కమల్ అన్నారు. శుక్రవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. రవీందర్ తన రాజకీయ లబ్ధి కోసం మాల సంఘం నాయకులను కించపర్చే విధంగా మాట్లాడం సరికాదన్నారు. కులానికి రాజకీయ రంగు పూయడం, మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు, ఎంపీ వంశీలకు సంబంధం లేని అంశాలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మరోసారి ఇలా చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో చంద్రు రాయమల్లు, ఎరుకల రమేష్, ఆర్ల నారాయణ, జంజర్ల శ్రీనివాస్, దీకొండ లక్ష్మణ్, జంజర్ల రాజులు పాల్గొన్నారు.

బేగంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

రామగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీం, జై సంవిధాన్ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలతో పాటు రాజ్యాంగం పుస్తకాలను చేతిలో పట్టుకొని గ్రామస్థులకు రాజ్యాంగం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్కకొంరయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు కల్వల శంకర్, కొరుకొప్పుల తులసీ రాంగౌడ్, తీగల సమ్మయ్య, కొత్తురి మోహన్, లక్కార్తి మల్లయ్య, బొంత సదానందం, రేణికుంట్ల కొంరయ్య, రాజేశం, మాతంగి కుమార్, పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

హమాలీలుగా మారిన సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హమాలీలు చేయాల్సిన పనిని ఆసుపత్రి సిబ్బందితో పని చేయిస్తున్నారు. శుక్రవారం ఆసుపత్రికి మందుల లోడ్‌తో వచ్చిన వ్యాన్‌లో సరుకులు దించాలని ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని పురమాయించడంతో ఆసుపత్రిలో పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. శానిటేషన్ విభాగానికి చెందిన ముగ్గురు, సెక్యూరిటీ విభాగానికి చెందిన ముగ్గురు సిబ్బంది వ్యాన్‌లో నుంచి మందులను స్టోర్‌లో దింపాలని చెప్పడంతో వారంతా హమాలీ పని చేశారు. కళాశాలకు వచ్చే ఏ వస్తువు అయినా హమాలీలతో దించాల్సి ఉండగా వారికి డబ్బులు ఇవ్వవల్సి వస్తుందనే కారణంతో ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందితో బరువులను దించిపిస్తున్నారు.



పని గంటలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పని గంటలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు ఆర్జీ-2 అధికారులకు సూచించారు. శుక్రవారం ఓసీపీ-3 ప్రాజెక్టును ఆయన సందర్శించారు. పీఓ ఆఫీస్‌లో అధికారులతో కలసి ఉత్పత్తి, ఉత్పాదకతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలు, ఓబీ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఓబీ వెలికితీత పనులు జరగాలని, యంత్రాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉద్యోగులకు అవసరమైన ఉపశమన చర్యలు తీసుకోవాలని, మంచి నీరు, మజ్జిగ తీసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు డైరెక్టర్ సూచించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. క్యాంటీన్‌లో సదుపాయాలను పరిశీలించిన డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఉద్యోగులతో కలసి అల్పాహారం చేశారు. వ్యూపాయింట్ నుంచి ప్రాజెక్టు పని స్థలాలను పరిశీలించి ఉత్పత్తి మెరుగుపడేందుకు పలు సూచనలు చేశారు. క్వారీలోకి దిగి డ్రాగ్‌లైన్, కోల్‌బెంచ్ మరియు ఆర్వీఆర్ ఓబీ కంపెనీలో ఓబీ పనులను ఆయన పరిశీలించారు. సీహెచ్‌పీలో బొగ్గు రవాణా తీరును పరిశీలించారు. డైరెక్టర్ వెంట జీఎం బండి వెంకటయ్య, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు ఉన్నారు.

సీహెచ్‌పీ, ఎస్ఎంఎస్ ప్లాంట్ల సందర్శన

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి స్టోర్స్ విభాగం జీఎం ఎలీషా శుక్రవారం ఆర్జీ-3 ఏరియాలోని సీహెచ్‌పీ, ఎస్ఎంఎస్ ప్లాంట్‌లను తనిఖీ చేశారు. స్టోర్‌లో యంత్రాలు, విడిభాగాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాఇరు. స్టోర్‌లో యంత్రాల విడిభాగాల నిర్వహణ విధానం, మెటీరియల్ అప్ కీపింగ్ లాంటి విషయాలపై చర్చించారు. అనంతరం పిట్ స్టోర్, ఎస్ఎంఎస్ ప్లాంట్‌లోని ట్రక్ వాహనాల పనితీరును ఎలీషా పరిశీలించారు. స్టోర్స్ మెటీరియల్ ఇన్వెంటరీ తగ్గించేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జీఎం వెంట ఏరియా ఇంజనీర్ శేఖర్‌బాబు, అధికారులు ఉన్నారు.

జీఎం కార్యాలయాన్ని ముట్టడించిన టీబీజీకేఎస్

- కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

గోదావరిఖని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌జీ-1 జీఎం కార్యాలయాన్ని టీబీజీకేఎస్ నాయకులు శుక్రవారం ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణకు గుండెకాయ అయిన సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి, కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం టీబీజీకేఎస్ పనిచేస్తుందన్నారు. సింగరేణిలో పర్మినెంట్ ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతుందని, రోజురోజుకు కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరుగుతుందని, దీంతో ఆర్థికంగా కార్మికులను దెబ్బకొట్టేందుకు సంస్థ ప్రయత్నం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుతో భవిష్యత్‌లో ప్రభుత్వరంగ సంస్థల ఉనికికే ప్రమాదమన్నారు. తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని, రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్‌లో కార్మిక కాలనీలకు రక్షిత మంచినీటిని అందించాలన్నారు. సింగరేణిలో అమలవుతున్న మెడికల్ రెఫరల్ విధానాన్ని సమీక్షించాలని, కార్మికులకు ఆసుపత్రుల్లో వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెన్‌కో నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని కోరారు. బొగ్గు బ్లాకుల వేలం పాటలో సింగరేణి సంస్థ పాల్గొనవద్దని, దీంతో సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల ఓట్లతో గెలిచిన ఎంపీ, ఎమ్మెల్యేలు, వారి కుటుంబాల సంక్షేమాన్ని మరిచారని, కార్మికుల మెరుగైన జీవన విధానం కోసం ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, నాయకులు నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, చెల్పూరి సతీష్, సంపత్‌రెడ్డి, రాజేశం, ఐ సత్యం, చంద్రయ్య, వాసర్ల జోసఫ్, చెలుకపెల్లి శ్రీనివాస్, రమేష్, శశాంక్, వెంకటేష్, శేషగిరి, తిరుపతి, రాజు పాల్గొన్నారు.



ఆర్జీ-1జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు

సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం

- రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్, పాల్గొన్న నాయకులు

రామగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిపై అనేక కార్మికుల కుటుంబాల భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. సింగరేణిని కాపాడుకొనే బాధ్యత కార్మికులపై ఉందన్నారు. 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మోదీ తెచ్చిన బిల్లు ఎంఎండీఆర్ చట్టానికి మద్దతు తెలిపి ప్రస్తుతం బొగ్గు గనుల యాక్షన్‌లో పాల్గొనకుండా సింగరేణికి బొగ్గు గనులు రాకుండా చేశారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పినా అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చింది బోనస్ కాదు బోగస్ అనడం సిగ్గు చేటుగా అభివర్ణించారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులే లేరని చెప్పిన బీఆర్ఎస్ పార్టీకి చెంప చెల్లుమనేలా సింగరేణిలో పనిచేసే 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు బోనస్ కల్పించామని గుర్తుచేశారు. సింగరేణి కాపాడే సత్తా కేవలం ఐఎన్‌టీయుసీ ట్రేడ్ యూనియన్‌కు మాత్రమే ఉందని పేర్కొన్నారు. సింగరేణిలో సంవత్సర కాలంలోనే అనేక హక్కులు, పథకాలను తెచ్చిన ఘనత ఐఎన్‌టీయుసీ, కాంగ్రెస్ ప్రభుత్వనిదేనని తెలిపారు. సమావేశంలో ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొట రవీందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వికాస్‌కుమార్‌యాదవ్, ఉయ్యాల కుమారస్వామి, గడ్డం తిరుపతి, రామారావు, స్వామి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.